

ఆగ్రో రైతు సేవాకేంద్రాలకు దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-విజయనగరం

ఆగ్రో రైతు సేవా కేంద్రాల కోసం అర్హులైన అభ్యర్థులు ఈనెల 9వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆగ్రోస్ జిల్లా మేనేజరు తెలిపారు. ప్రభుత్వం మండలానికి ఒక ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని మంజూరు చేశారని, ఈ కేంద్రం ద్వారానే వ్యవసాయ పనిముట్లు, ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు రైతులకు విక్రయించాల్సి ఉందని తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత సైన్స్ పట్టభద్రులై ఉండి స్థానికంగా ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈనెల 9 వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం జిల్లా మేనేజరు, ఆంధ్రప్రదేశ్ ఆగ్రోస్, విజయనగరం, సెల్ 9989079452, 9948098534లను సంప్రదించాలని కోరారు.



పొలంలో కోసిన వరిచేను



కోసిన వరిచేనును తరలిస్తున్న రైతులు

ఆకాశంలో కారుమబ్బులు..

అన్నదాత గుండెల్లో గుబులు

నూర్పు చేసి అమ్మకానికి సిద్ధంగా ధాన్యం రాశులు

ఆకాశంలో కారుమబ్బులు అన్నదాతల గుండెల్లో గుబులు పుట్టిస్తున్నాయి. రెండు మూడు రోజుల్లో తుపాను కారణంగా దక్షిణ కోస్తాలో భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ వర్షాలు పడతాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుల ఆందోళనకు అద్దం పట్టినట్టుగా ఆకాశంలో మార్పులు మొదలయ్యాయి. ఏ క్షణాన వర్షాలు పడి తమ కొంప ముంచుతాయోనని దిగులు చెందుతున్నారు.

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా వ్యాప్తంగా ఒకవైపు వరి కోతలు, పంట నూర్పుళ్లలో రైతులు తలమునకలై ఉన్నారు. ఇలాంటి తరుణంలో కనిపిస్తున్న కారుమబ్బులు అన్నదాతలను కలవరపెడుతున్నాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు పడితే కోలుకోలేని దెబ్బ తినాల్సి వస్తుందని ఆందోళనకు గురవుతున్నారు. వరికోతలు కోసి ఒకటి రెండు రోజులపాటు మడులలోనే చేను ఆరేలా ఉంచాల్సిన అవసరముంది. ఇలాంటి పరిస్థితుల్లో వర్షం పడితే ధాన్యం కంకుల నుంచి గింజలు పూర్తిగా రాలిపోయే, తడిచే అవకాశం ఉంటుంది. దీనివల్ల రైతు కష్టం బుగ్గిపాలవుతుంది. అదే విధంగా కొంతమంది రైతులు వరి నూర్పులు చేసి ధాన్యాన్ని అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. బస్తాలకు ధాన్యం పట్టి కళ్లల్లోనే అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఇలాంటి సమయంలోనూ వర్షం పడితే ధాన్యం రంగు మారే ప్రమాదం పొంచి ఉంది. దీంతో రైతులు కనీస మద్దతుధర కోల్పోయే అవకాశం ఎక్కువగా ఉంది. ఒకవైపు కోత కోసి మడుల్లోనే ఉంచిన ధాన్యం చేళ్లని పొలంలోనే చిన్న చిన్న దిబ్బలుగా వేయడానికి సిద్ధమవుతున్నారు. మబ్బులు చూసి ఆందోళనకు గురవుతున్న అన్నదాతలు ఏం చేయాలో తెలియని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు.

కొనుగోలు కేంద్రాలేవీ

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఇంకా బాలారిష్టాల మధ్య కొనసాగుతోంది. ఈ ఏడాది పూర్తి స్థాయిలో రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. బ్యాంకు గ్యారంటీ లేని రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయరాదని అధికారులు హెచ్చరిస్తున్నారు. గత ఏడాదిలో ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు చాలా చేదు అనుభవాలు చవిచూశారు. ప్రభుత్వం, రైస్ మిల్లర్లు మధ్య అవగాహన లేకపోవడంతో స్థానిక మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయలేదు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి రైస్ మిల్లర్లను తీసుకొచ్చి జిల్లా అధికారులు ధాన్యం కొనుగోలు చేయించారు. పేరుకు కనీస మద్దతు ధర ఇస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం పైకి చెపుతున్నా కింద స్థాయిలో అది సాధ్యం కావడంలేదు. దీంతో రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలు ధాన్యం కొనుగోలులో రైతులకు గుదిబండగా మారుతున్నాయి.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం బస్తాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ఓటు హక్కుపై ఇంటింటి సర్వే

ఓటుకు ఆధార్‌ను అనుసంధానం కలెక్టర్ ఎ.సూర్యకుమారి

ప్రజాశక్తి-విజయనగరం

బిఎల్‌ఒలు తప్పనిసరిగా ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేయాలని, అర్హత ఉన్నవారందరికీ ఓటుహక్కు కల్పించాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. కార్పొరేషన్ పరిధిలోని 219 మంది బూత్ లెవెల్ అధికారులకు, ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, ఓటర్ల జాబితాల సవరణకు మరో రెండు రోజులు మాత్రమే గడువు ఉందని, యుద్ధప్రాతిపధికన సర్వే నిర్వహించాలని సూచించారు. 17 ఏళ్లు నిండిన వారివద్ద నుంచి కూడా ఓటు కోసం దరఖాస్తు స్వీకరించాలని చెప్పారు. మరణించిన వారు, వలస వెళ్లి పోయినవారి పేర్లను తొలగించి, ఖచ్చితమైన ఓటర్ల జాబితాలను తయారు చేయాలన్నారు. ఓటుకు ఆధార్‌ను అనుసంధానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తహశీల్దార్ బంగార్రాజు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సాయుధ దళాల సేవలు నిరుపమానం

సాయుధ దళాలు దేశానికి అందిస్తున్న సేవలు నిరుపమానమని కలెక్టర్ ఎ.సూర్యకుమారి కొనియాడారు. వారి త్యాగాలు అమోఘమని పేర్కొన్నారు. సాయుధ దళాల పతాక దినోత్సవం కలెక్టరేట్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. కలెక్టర్‌కు పతాక నిధి ఫ్లాగ్‌ను జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ, సైనిక దళాల సేవలను కొనియాడారు. వీరజవాన్లకు వందనం సమర్పించేందుకు, వారి కుటుంబాలకు చేయూతనిచ్చేందుకు సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని చెప్పారు. పెద్ద ఎత్తున విరాళాలు ఇచ్చి, వారి త్యాగాలను గౌరవించాలని పిలుపునిచ్చారు. అనంతర గోడపత్రికలను కలెక్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమాధికారి మజ్జి కృష్ణారావు మాట్లాడుతూ, సైనికుల సంక్షేమానికి పెద్ద ఎత్తున విరాళాలను అందించాలని కోరారు. జిల్లా సైనిక సంక్షేమాధికారి, విజయనగరం ఎస్‌బిఐ ఖాతా నెంబరు 52065221666, ఐఎఫ్‌ఎస్‌సి కోడ్ ఎస్‌బిఐఎన్ 0020931 కు గానీ, లేదా డైరెక్టర్, సైనిక్ వెల్ఫేర్, విజయవాడ పేరుమీద చెక్కు లేదా డ్రాఫ్ట్ ద్వారా కూడా తమకు విరాళాలను అందజేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరాములనాయుడు, సహాయ కమిషనర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

ఉమాకవి, దేవానంద్‌కు గురజాడ పురస్కారం

గుమ్మలక్ష్మీపురం :మండలానికి చెందిన సాహితీ చైతన్య కిరణాలు, బాల కథానిలయం అధ్యక్ష, ఉపాధ్యక్షులు బోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి), పాలక దేవానంద్‌కు గురజాడ పురస్కారం లభించింది. తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఆధ్వర్యంలో గురజాడ వర్ధంతి సందర్భంగా ఆన్‌లైన్‌లో కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సమ్మేళనంలో గురజాడపై వారు రాసిన కవితలకు ఆ సంస్థ అధ్యక్షులు మూర్తి ప్రశంసా పత్రాలను అందజేశారు.



నిరసన తెలుపుతున్న బొగ్గులదిబ్బ వాసులు, సిపిఎం నాయకులు

పేదల ఇళ్లు కూల్చొద్దు..

ఉన్నచోటే పట్టాలివ్వాలి : సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు

ప్రజాశకి-విజయనగరం టౌన్

నగరంలోని కంటోన్మెంట్ బొగ్గుల దిబ్బ వద్ద 50 ఏళ్లుగా నివాసం ఉంటున్న పేదల ఇళ్లు కూల్చేస్తామని, వెంటనే కాళీ చెయ్యాలని స్థానిక కార్పొరేటర్ వత్తిడి చేయడాన్ని నిరసిస్తూ సిపిఎం నగర కమిటీ ఆధర్యంలో పేదలంతా బొగ్గులు దిబ్బ వద్ద నిరసన ధర్నా చేపట్టారు. ఇక్కడే పట్టాలిచ్చి ఇళ్లు కట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ 120 కుటుంబాలలో 50 ఇళ్లకు సారిపల్లి వద్ద టిడ్కో ఇళ్లు మంజూర య్యాయని, అక్కడికి వెళ్లి పోవాలని ఒత్తిడి తెస్తున్నారన్నారు. వాస్తవానికి సారిపల్లి వద్ద టిడ్కోఇళ్లు మంజూరు చేయని వారు ఎక్కడికి పోవాలో కార్పొరేటర్ సమాధానం చెప్పాలన్నారు. టిడ్కో ఇళ్లు ఊరికి 10 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయని, అక్కడ నీరు లేదు, కరెంట్ లేదని, పిల్లలు చదువుకునేందుకు బడి కూడా లేదని తెలిపారు. రోజువారీ కూలి పనులు చేస్తూ బతికే పేదలు అక్కడ ఎలా బతకాలో కార్పొరేటర్ సమాధానం చెప్పాలన్నారు. ప్రస్తుతం ఉన్న చోటే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బిసిలను నిర్వీర్యం చేయడమే జగన్ లక్ష్యం

ఇదేం కర్మ బిసిలకంటూ కలెక్టర్‌కు టిడిపి నాయకుల వినతి

ప్రజాశక్తి-విజయనగరం

బిసిలను నిర్వీర్యం చేయడమే వైసిపి ప్రభుత్వ లక్ష్యమని టిడిపి నాయకులు దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు చేస్తున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ 'ఇదేం ఖర్మ మన బిసిలకు' కార్యక్రమంలో భాగంగా బిసి నాయకులంతా బుధవారం కలెక్టర్‌కు వినతినిచ్చారు. ఈ సందర్భంగా ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కోల లలిత కుమారి , నెల్లిమర్ల మాజీ ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామి నాయుడు, విజయనగరం పార్లమెంటు నియోజక వర్గ జిల్లా అద్యక్షులు నారాయణరావు, విజయనగరం మండల అధ్యక్షులు బొద్దుల నర్సింగరావు మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లయినా బిసిలకు ఒరిగిందేమీ లేదన్నారు. 56 కార్పొరేషన్ ఏర్పాటు చేసి వారికి నిధులు విధులు లేకుండా చేశారన్నారు. బిసిలకు న్యాయం జరగాలంటే చంద్రబాబు మళ్లీ అధికారంలోకి రావాలని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, రాష్ట్ర కార్యదర్శులు మహంతి చిన్నంనాయుడు, కరణం శివరామకష్ణ, కర్రోతు బంగార్రాజు, విజయనగరం పట్టణ, మండల పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, బొద్దుల నర్సింగరావు, ఆల్తి బంగారుబాబు, గంటా పోలినాయుడు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, మహంతి గౌరీశంకర రావు, బిసి నాయకులు కనకల మురళీమోహన్, కోండ్రు శ్రీనివాసరావు, మైలిపిల్లి సింహాచలం, మాడిమి దేవేంద్రనాథ్, గంటా రవి, ఎస్ కె. ఎం బాషా, లెంక అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతినిస్తున్న టిడిపి నాయకులు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఎస్‌ఎఫ్‌ఐ ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థి ఉద్యమ వేగుచుక్క ఎస్‌ఎఫ్‌ఐ అఖిల భారత మహాసభలు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఈనెల 13 నుంచి 16వరకు జరుగనున్నాయని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ తెలిపారు. బుధవారం ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నాశనం చేసే విధంగా నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకువస్తుందని, దానిలో భాగంగానే దేశ వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీల్లో బిజెపి అనుబంధ అర్‌ఎస్‌ఎస్ భావజాల వైస్ ఛాన్సలర్‌లను నియమించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో ఉన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రభుత్వ విద్యను బలోపేతం చెయ్యాల్సింది పోయి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలలో టీచర్లను నియమించి, విద్యార్థులకు పాఠాలు చెప్పించకుండా తక్కువ శాతం గ్రూపుల హాజరు ఉన్న గ్రూప్స్‌ను కాలేజీలలో తీసివేయడం అంటే పేద విద్యార్థులకు విద్యని దూరం చేయడమేనని అన్నారు. సమస్యలను అఖిల భారత మహాసభలో చర్చించి భవిష్యత్తు పోరాటాలకు ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ వెంకటేష్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యాదర్శి సిహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్‌టియు) పిలుపుమేరకు విజయనగరం కలెక్టరేట్ ఎదుట ఉపాధ్యాయులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై.అప్పారావు, డి.శ్యామ్ మాట్లాడారు. 2022 మార్చిలో చెల్లిస్తామని చెప్పిన పిఆర్‌సి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదని, పిఆర్‌సి అమలు అనంతరం ప్రకటించాల్సిన రెండు డిఎలు ఇంతవరకు ప్రకటించలేదని తక్షణమే అవి ప్రకటించాలని డిమాండ్ చేశారు. 2019 నుంచి ఇప్పటివరకు ఎటువంటి డిఎ ఎరియర్స్ సిపిఎస్ ఉద్యోగులకు జమ చేయలేదని, వెంటనే అవి జమ చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షులు జెసి రాజు మాట్లాడుతూ జీతాలు చెల్లింపులో జాప్యం సరికాదని, ఇప్పటికైనా సకాలంలో ప్రతినెలా ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒ ఎం.గణపతిరావుకు వినతిపత్రం ఇచ్చారు. సమస్యలు పరిష్కారం జరగకపోతే రాష్ట్రస్థాయిలో ఈనెల 20న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర గిరిజన కమిటీ కన్వీనర్ శ్రీనివాస దొర, జిల్లా కార్యవర్గ సభ్యులు నారాయణరావు, బాలాజీ, సంఘ సభ్యులు, జాషువా, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్‌టియు నాయకులు, ఉపాధ్యాయులు





అధ్యక్షులు గోవిందరావు; ప్రధాన కార్యదర్శి ధనుంజయరావు

ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీర్స్ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామీణ నీటి సరఫరా ఇంజినీర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక మంగళ వారం నగరంలోని ఆశాఖ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయం ఆవరణలో జరిగింది. ఎన్నికల అధికారిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు రమణప్రభాత్ వ్యవహరించారు. జిల్లా అధ్యక్షులుగా చీపురుపల్లి డిఇ ఎడ్ల గోవిందరావు, ప్రధాన కార్యదర్శిగా గజపతినగరం ఎఇ బి.ధనుంజయరావు, ఉపాధ్యక్షులుగా లక్కవరపుకోట డిఇ కె.పైడిరాజు, కోశాధికారిగా విజయనగరం ఎఇ అర్.సత్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చీపురుపల్లి ఎఇ అర్.పార్వతి ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని ఇంజినీర్లు, సిబ్బంది అభినందించారు.

తనిఖీలు ముమ్మరం

విజయనగరం టౌన్ : నగరంలో ప్లాస్టిక్ వస్తువుల తనిఖీ ప్రక్రియ నిరంతరయంగా కొనసాగుతోంది. కమిషనర్ ఆర్.శ్రీరాములు నాయుడు సూచనలతో ఒకసారి వినియోగించి పారవేసే ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నియంత్రించేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను జల్లెడ పట్టేందుకు ముమ్మర తనిఖీలను చేపట్టారు. హోల్‌సేల్ దుకాణాలలో 25 వేల వరకు జరిమానాలు విధించడంతోపాటు సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

స్వయం ఉపాధి వైపు ప్రోత్సాహం : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం


జీవనోపాధికి ఉద్యోగం ఒక్కటే మార్గం కాదని, స్వయం ఉపాధి రంగంలో అనేక మార్గాలు ఉన్నాయని.. వీటిపై విద్యార్థులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లను ఉద్దేశించి కలెక్టర్ ఎ. సూర్యకుమారి పేర్కొన్నారు. యువతను ప్రధానంగా స్వయం ఉపాధి వైపు ప్రోత్సహించాలని సూచించారు. ప్రయివేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో బుధవారం తన ఛాంబర్లో సమావేశం నిర్వహించారు. యువత - ఉపాధి, ఓటు నమోదు, సామాజిక పరివర్తన తదితర అంశాలపై సమీక్షించారు. విద్యార్థి జీవితంలో ఇంటర్మీడియట్ ప్రధాన దశ అని ఇక్కడే వారిలో మానసిక పరివర్తన కలిగేలా శిక్షణ అందించాల్సి ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు ఎన్.సి.సి., ఎన్.ఎస్.ఎస్., ఎన్.వై.కె. గ్రూపుల్లో భాగస్వామ్యం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

టెక్ బిలో చేరే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

12వ తరగతి ఎంపిసి గ్రూపులో ఉత్తీర్ణులైన వారికి డిగ్రీతో పాటు ఉపాధి అందించేందుకు హెచ్‌సిఎల్ సంస్థ ముందుకు వచ్చిందని, ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకొనేలా అవగాహన కల్పించాలని ప్రిన్సిపాళ్లకు కలెక్టర్ సూచించారు. టెక్ బి ప్రోగ్రాంలో చేరి శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉపాధి కల్పిస్తారని తెలిపారు. సమావేశంలో ఆర్‌ఐఒ మజ్జి సత్యనారాయణ, కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఓటును నమోదు చేసుకోండి : విసి

నెల్లిమర్ల : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటును ఈ నెల 9 లోగా నమోదు చేసుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ జిఎస్‌ఎన్ రాజు పిలుపు నిచ్చారు. బుధవారం విశ్వావిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో ఓటు వజ్రాయుధం వంటిదన్నారు. ఎన్నికల్లో మంచి విజ్ఞత ఉన్న వ్యక్తిని ఎన్నుకోడానికి మనకున్న ఏకైక ఆయుధం ఓటు అని గుర్తె రాగాలన్నారు. కార్యక్రమంలో ఎయు ఐక్య విద్యార్థి ఫ్రెండ్ చైర్మన్ గవర జగన్మోహన్, రూప రాంబాబు, గురవయ్య, అల్లిపిల్లి గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న విసి జిఎస్‌ఎన్ రాజు



ప్రజలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పథకాల అమలుపై ఆరా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా నగరంలోని 37 డివిజన్ విటి అగ్రహారం బిసి కాలనీలో బుధవారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పర్యటించారు. పేదలకు అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వి.ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ సమస్యలు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి కోలగట్ల కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో స్వామి చేస్తున్న కషి అభినందనీయమన్నారు. స్థానిక కార్పొరేటర్ కడియాల రామకృష్ణ, సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ గోల్ కీపర్‌గా జయసూర్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 14స్కూల్ గేమ్స్ రాష్ట్ర ఫుట్ బాల్ పోటీలకు జిల్లా జట్టుకు గోల్ కీపర్ గా స్థానిక ఒలింపియాడ్ స్కూల్ విద్యార్థి బి.జయసూర్య ఎంపిక య్యాడు. ఈ సందర్భంగా జయసూర్యను స్కూల్ ప్రిన్సిపాల్ గిరీష్ ప్రసాద్, పీడీ అప్పలరాజు అభినందించారు.



పోలీసుల అవగాహన సదస్సు

మెంటాడ : మండల కేంద్రంలో ఆండ్ర ఎస్ఐ రమణ ఆధ్వర్యంలో బుధవారం పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం చట్టరీత్యా నేరమన్నారు. మద్యం వల్ల కలిగే అనర్థాలు, వాటి వల్ల కలిగే నష్టాలు ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆండ్ర పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనుల పరిశీలన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు – నేడు పనులను ఎంపిడిఒ బి. పట్నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు నేడు అభివృద్ధి పనులలో నాణ్యత పాటించాలన్నారు. ఆలోపాలు వస్తే చట్టపరమైన చర్యలు తప్పవని సంబంధిత అధికారులను సూచించారు. ఈ పరిశీలనలో విద్యార్థులకు అందిస్తున్న ఎండిఎంను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. బాల భాస్కర్, సిఆర్‌పి కాటపల్లి ప్రసాద్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ జయప్రకాష్, వెల్ఫేర్ అసిస్టెంట్ నారాయణరావు పాల్గొన్నారు.

సోంపురంలో ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు

వేపాడ : మండలంలోని సోంపురంలో బుధవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో భాగంగా వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా బొద్దాం పిహెచ్‌సి ఎంఒ డాక్టర్ ఎల్ రమాదేవి, 104 ఎంఒ రామలతలు ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రమ, హెచ్ఎ దారినాయుడు, డిఇఒ మోహన్, కె సతీష్, ఆశ కాంతి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు రగ్గులు పంపిణీ

శృంగవరపుకోట : మండలంలోని ధర్మవరం పంచాయతీలో పారిశుధ్య కార్మికులుగా పనిచేస్తున్న వారికి బుధవారం ఉదయం స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా రగ్గులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని వడ్డిరాజు రామనారాయణరావు సౌజన్యంతో నిర్వహించినట్లు సంస్థ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్నేహ కార్యదర్శి మంథా సుబ్బారావు, ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు డాక్టర్ పొట్నూరు శ్రీరాములు, రాము తదితరులు పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేసే సమయం ఆసన్నమైంది

రేగిడి : కలిసికట్టుగా పనిచేసే సమయం ఆసన్నమైందని టిడిపి నాయకులు కిమిడి రామమల్లిక్ నాయుడు అన్నారు. రేగిడిలో తన స్వగృహంలో బుధవారం ఆయన వంగర, సంతకవిటి మండలాల టిడిపి నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి బలోపేతం చేసి రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీలను గెలిపించుకొని తమ సత్తా ఏంటో నిరూపించుకుందామని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపిపిలు పైల వెంకటరమణ, బెజ్జపురపు త్రినాథ్, కేశవ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి

వంగర : ఈనెల 12,13,14 తేదీల్లో విజయనగరంలో జరగనున్న ఆశాల రాష్ట్ర 4వ మహా సభలను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి కోరారు. బుధవారం రాజాం సిఐటియు కార్యాలయంలో సభలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పార్వతి, రమణమ్మ, సూర్య మణి, చిన్నమ్మడు, లక్ష్మి రాణి, సరోజిని, రవణమ్మ, జయ, గురులక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపకరణాల గుర్తింపు శిబిరం

శృంగవరపుకోట : జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఈనెల 9న పట్టణంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో వికలాంగులకు ఉచిత ఉపకరణాలు ఇచ్చేందుకు గుర్తింపు శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఇఒ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కేంద్రంలో జామి, గంట్యాడ, ఎస్‌కోట మండలాలలో వికలాంగులైన ఐదు సంవత్సరాల నుండి 18 సంవత్సరాల వయస్సు కలిగిన విద్యార్థులు తమ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

డెంకాడలో టిడిపి మాటామంతి

డెంకాడ : డెంకాడ మండల కేంద్రంలో టిడిపి ఆధ్వర్యంలో బుధవారం మాటా మంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా మహిళ అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి పాల్గొని మహిళల సమస్యలపై ఆరా తీశారు. మహిళల పెన్షన్లు, రేషన్ కార్డులు తొలిగింపుపై మహళలు తమ ఆవేదన వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ ప్రధాన కార్యదర్శి అనురాధ బేగం, మహిళా నాయకులు చిల్ల పద్మ లెంక హైమావతి, డెంకాడ ఎంపిటిసి కోరాడ కుమారి, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని వినతి

భోగాపురం : మత్స్యకారులు వేట సమయంలో పడవ ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన తీర ప్రాంత మండలాలైన భోగాపురం, పూసపాటిరేగకు చెందిన 9 మంది కుటుంబాలకు సంబంధించి ఎక్సగ్రేషియా విడుదల చేయాలని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మైలపల్లి నరసింహులు, కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులు కోరారు. ఈ మేరకు బుధవారం మంత్రి సీదిరి అప్పలరాజును కలసి మత్స్యకారుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. మత్స్యకారులు జీవన ఉపాధికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రధానంగా వేట సమయంలో ప్రమాదాలు బారిన పడి ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదకోవాలన్నారు.

త్రో బాల్ పోటీలకు ఎంపిక

శృంగవరపుకోట : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో బుధవారం ఉదయం స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి త్రో బాల్ అండర్ 14, 17 బాల బాలికల ఎంపిక పోటీలు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జి.లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగాయి. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఎస్.వి. సత్యశేఖర్, జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్.వి.రమణ, ప్రధానోపాధ్యాయులు జోగేందర్, జిల్లా వ్యాయమ ఉపాధ్యాయుల సంఘం కార్యదర్శి కె.సన్యాసినాయుడు, త్రోబాల్ సంఘం కార్యదర్శి లక్ష్మణ్, పొట్నూరు శ్రీరాములు పాల్గొని లాంఛనంగా ప్రారంభించారు డాక్టర్ సత్యశేఖర్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు.

కుళాయి పన్ను బకాయిలపై కొరడా

బొబ్బిలి : కుళాయి పన్ను బకాయిలపై మున్సిపల్ అధికారులు కొరడా ఝులిపిస్తున్నారు. బకాయిలు అధికంగా ఉన్న కుళాయి కనెక్షన్ రద్దు చేయాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నుంచి ఆదేశాలు రావడంతో బుధవారం పట్టణంలో కుళాయి బకాయిలపై ఆరా తీశారు. పన్ను సకాలంలో చెల్లించని కుళాయి కనెక్షన్ కట్ చేశారు. కుళాయి పన్నులు కట్టకపోతే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ ఆర్ఒ ప్రసాద్ హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ సురేష్, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

బొబ్బిలిరూరల్ : ఏ ఒక్క రైతూ నష్టపోకుండా అందరి వద్ద ధ్యానం కొనుగోలు చెయ్యాలని ఇన్‌ఛార్జి ఎడి యం.శ్యాం సుందర్ అన్నారు.బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మిల్లర్లు, వ్యవసాయ సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 10మంది మిల్లర్లు ధాన్యం కొనుగోలుకు సహకరించాలని, ఇప్పటికే 8 మంది మిల్లర్లు గ్యారంటీ మొత్తం చెల్లించారని తెలిపారు. మిల్లర్లకు, రైతులకు అనుసంధాన కర్తలుగా వ్యవసాయ సహాయకులు, వాలంటీర్లు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పని చేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్ధార్ యన్, రాజేశ్వరరావు, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ భాస్కరరావు,మిల్లర్లు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఫర్నీచర్ విక్రయానికి 23న బహిరంగ వేలం

విజయనగరం : వినియోగదారుల కమిషన్ కార్యాలయ పరిధిలో ఉన్న ఫర్నీచర్, కంప్యూటర్లు, ఫ్యాన్లు, కీ బోర్డులు, బ్యాటరీల విక్రయం నిమిత్తం ఈనెల 23న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వినియోగదారుల కమిషన్ జిల్లా అధ్యక్షులు ఆర్. వెంకట నాగసుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిషన్ ఉత్తర్వుల మేరకు నిబంధనలను అనుసరించి ఈనెల 23న సాయంత్రం 3 గంటలకు జిల్లా కమిషన్ కార్యాలయ పరిధిలో బహిరంగ వేలం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

అందుబాటులో కొనుగోలు కేంద్రాలు

విజయనగరం : జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు అందుబాటులోనే ఉన్నాయని పౌర సరఫరాల సంస్థ డిఎం మీనా కుమారి తెలిపారు. బుధవారం ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ధాన్యం కొనేవారేరీ' కథనానికి ఆమె స్పందించారు. జిల్లా మొత్తంగా 510 రైతు భరోసా కేంద్రాలు, 65 ప్రాథమిక సహకార సంఘాలు, 20 రైతు సంఘాల సంస్థలు ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. జిల్లాలో గతనెల 15నే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని తెలిపారు. రైతులకు గోనెసంచులను ఆర్‌బికెల ద్వారా సరఫరా చేస్తున్నామని తెలిపారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ఆర్‌బికెల్లోనే ధాన్యం విక్రయించాలని తెలిపారు.

సం'క్షేమం' లేని వసతి గృహాలు

ప్రజాశక్తి- మెరక ముడిదాం

మండలంలోని గర్భాం సాంఘిక సంక్షేమ వసతి గృహంలో సౌకర్యాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా వసతి గృహంలో విద్యార్థులు టాయిలెట్స్ లేక బాహ్య ప్రదేశంలోకి వెళ్ళ వలసి వస్తుంది. అయిదు టాయిలెట్స్ గదులు ఉన్నప్పటికీ ఏ ఒక్కటి పని చేయటం లేదు. గదులు అన్ని మురికి కూపంతో నిండి ఉన్నప్పటికీ పట్టించుకొనే నాదుడే లేడు. చాలా కాలం నుండి కూడా అలాగే వున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

శిధిలావస్థకు చేరిన పై కప్పు

వసతి గృహం పై కప్పు పూర్తిగా శిధిలావస్థకు చేరింది. పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు భయాందోళన చెందుతున్నారు. పడుకొనే సమయంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని విద్యార్థులు



ఇంకా నిర్మాణంలోనే ఉన్న మరుగుదొడ్లు

ప్రశ్నిస్తున్నారు. వసతి గృహమంతా వున్న కరెంటు వైర్లు, బోర్డులు చితికి పోయి ఉండటం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతోందనని బిక్కుబిక్కుమంటూ విద్యార్థులు చదువులు వెళ్లదీస్తున్నారు. కిటికీలు, తలుపులు కూడా పూర్తిగా పాడవడం వల్ల చలికాలం చల్లగాలి లోపలికి వచ్చి చలికి ఇబ్బంది పడుతున్నామని చెబుతున్నారు. పైగా వర్షం పడినా కారిపోతుందని నూతన భవనం నిర్మించాలని కోరుతున్నారు.

అసంపూర్తిగా మరుగుదొడ్ల నిర్మాణం

వసతిగృహంలో పది మరుగుదొడ్లను ఎనిమిదేళ్ల క్రితం నిర్మించారు. అవి కూడా అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఇన్ని సంవత్సరాలు అవుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు వాటిని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవడం లేదు. ఇన్ని సమస్యలు నడుమ విద్యార్థులు చదవులు వెల్లదీయడం కష్టంగా ఉంటుందని తల్లి దండ్రులు చెబుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతి నిధులు విద్యార్థుల భవిష్యత్ పై, వసతి గృహాల్లో వున్న సంక్షేమంపై దృష్టి పెడితే భాగుంటుందని పలువురు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.



అపరిశుభ్రంగా ఉన్న బాత్‌రూం

కబడ్డీ పోటీలకు ఉద్యోగి ఎంపిక



నెల్లిమర్ల : అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీలకు జరజాపు పేటకు చెందిన ఉద్యోగి ఎంపికైనట్లు రిటైర్డ్ పిడి, కబడ్డీ కోచ్ బొమ్మన రామారావు తెలిపారు. బుధవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ జరజాపు పేటకు చెందిన ఉద్యోగి కాళ్ళ శంకర రావు వచ్చే నెల హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలకు ఏపి సివిల్ సర్వీస్ ఉద్యోగుల తరపున ఎంపికయ్యారని తెలిపారు. శంకరరావు దత్తి రాజేరు మండలం గడసాం సచివాలయంలో విద్య శాఖ సహయకలుగా విధులు నిర్వర్తిస్తూ ఇటీవల రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల కబడ్డీ పోటీల్లో మంచి ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సంధర్భంగా శంకర రావుని రిటైర్డ్ పిడి బొమ్మన రామారావు, జరజాపు పేట గ్రామస్థులు, దత్తి రాజేరు ఎంపిపి, ఎంపిడిఒ, గ్రామస్తులు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు అభినందించారు.

ప్రణాళికల్లో పారదర్శకత అవసరం

ప్రజాశక్తి- రేగిడి

గ్రామపంచాయతీల ప్రణాళికల్లో పారదర్శకత అవసరమని జెడ్‌పి సిఇఒ ఎం. అశోక్ కుమార్ సూచించారు. బుధవారం స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలపై జరుగుతున్న శిక్షణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిపిడిపి తయారీకి గ్రామపంచాయతీ స్థాయి కార్యక్రమాల క్యాలెండర్ తయారు చేయాలని సూచించారు. సామాజిక న్యాయంతో కూడిన ఆర్థికాభివృద్ధి సాధించడానికి భారత రాజ్యాంగం 11వ షెడ్యూల్ ప్రాప్తికి 29 అంశాలు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. పేదరికం లేని మెరుగైన జీవనోపాదులు గ్రామాలుగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. స్థానిక కార్యచరణ సూత్రాల్లో భాగంగా గ్రామంలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీ ప్రణాళికలు బాధ్యతయుతంగా చేపట్టాలన్నారు. ఈ శిక్షణలో ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాధరావు, ఇఒపిఆర్‌డి నాగభూషణరావు, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ శ్రీ చరణ్, మండల జెఇ రామకృష్ణ, అన్ని శాఖల సిబ్బంది హాజరయ్యారు.

ఈ నెల 9న ఆపదమిత్ర

విపత్తుల సమయంలో అండగా నిలిచేందుకు నేషనల్ డిజిస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ ఆపదమిత్ర కార్యక్రమాన్ని ఈ నెల 9న పార్వతీపురం మన్యం జిల్లాలలో ప్రారంభిస్తున్నట్లు జెడ్‌పి సిఇఒ ఎం. అశోక్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన

జెడ్‌పి సిఇఒ అశోక్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ అశోక్‌కుమార్

ఎంపిడిఒ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విపత్తుల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యల పై 12 రోజులు పాటు ఆశాలు, వాలంటీర్లకు శిక్షణ ఉంటుందని అన్నారు. ఇందులో భాగంగా వాలంటీర్లు, ఆశాలను గుర్తించాలని మండల స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశామన్నారు. వాలంటీర్లు, ఆశాల చిరునామా, మొబైల్ ఫోన్ నెంబర్లు, ఆధార్‌తో సహా ఈనెల 8 నాటికి అందజేయాలన్నారు. విజయనగరం జిల్లాలలో 27 మండలాలు, పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాల్లో డిసెంబర్ 15 నాటికి గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2023– 24 ఆర్థిక సంవత్సరాలకు ప్రజా ప్రతినిధులు, అధికారులకు, సచివాలయాల శాఖల వారీగా అధికార సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

కాలనీల నిర్మాణం వేగవంతం

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలోని జగనన్న కాలనీల నిర్మాణాలను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి డి. వెంకటేశ్వర రావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రారంభించనున్న సామూహిక గృహ ప్రవేశాలకు మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్మిస్తున్న జగనన్న కాలనీలను పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆర్థిక సహాయం ఇళ్ల నిర్మాణం కోసం సరిపోతుందని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. లబ్ధిదారులు విలాసవంతమైన నిర్మాణం చేపడితే ప్రభుత్వం అందజేస్తున్న ఆర్థిక సహాయం సరిపోదని ఆయన అన్నారు. జగనన్న నిర్మాణం కోసం బ్యాంకుల ద్వారా రూ. 35వేలు మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ నిధులతో చేపట్టిన కన్వెర్జెన్సీ పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. రైతు భరోసా, వెల్ నెస్, డిజిటల్ డిజిటల్ లైబ్రరీ పనులను పూర్తిచేయాలని ఆయన పేర్కొన్నారు. వివిధ సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. పెండింగ్ దరఖాస్తులు, ఆరోగ్య తనిఖీలు, ఫోర్టిఫైడ్ బియ్యం వినియోగం, ల్యాండ్ సర్వే, సిటిజన్ అవుట్ రీచ్ సర్వే, జగనన్న కాలనీల నిర్మాణం, ఉపాధి హామీ పనులపై సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించు కొనేలా లబ్ధిదారులను చైతన్య పరచాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ వెంకటరావు, మెడికల్ అండ్ హెల్త్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరావు

ఎండిఎం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి – పూసపాటిరేగ

మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో ఎండిఎం నిర్వాహకులు మంగళవారం తహశీల్దార్ బాస్కరావుకు వినతి అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు బచ్చల సూర్యనారాయణ మాట్లాడుతూ ఎండిఎం నిర్వాహకులను కార్మికులుగా గుర్తించి, కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రతి నెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, 12 నెలలకు వేతనాలు ఇవ్వాలని, మార్కెట్లో పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు 20 రూపాయలు పెంచాలని, నూతన మెనూలో హాట్ పొంగలి, సాంబార్ బాత్, ఆకుకూర అన్నం, తొలగించాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, సామాజిక భద్రత సౌకర్యాలు కల్పించాలని, బడ్జెట్ పెంచాలని పథకాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించరాదని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, రెండు జతలు యూనిఫామ్ ఇవ్వాలని, ప్రమాద భీమా సౌకర్యం కల్పించాలని కోరారు. తహశీల్దార్ స్పందించి ఈ విషయం పై అధికార్లుకు తెలియజేస్తామన్నారు. వినతి ఇచ్చిన వారిలో దిబ్బిడి కంచమ్మ, ఎరుకొండ కొండమ్మ, అప్పలనర్సమ్మ, నాగమణి ఉన్నారు.



తహశీల్దార్‌కు వినతి పత్రాన్నిస్తున్న ఎండిఎం కార్మికులు

ఎన్నాళ్లు పస్తులుండాలి : సిపిఎం

ప్రజాశక్తి – జామి

పంచాయితీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు జీతాలు లేక ఎన్నాళ్ళు పస్తులుండాలని సిపిఎం జిల్లా నాయకులు, గ్రీన్ అంబాసిడర్లు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ అన్నారు. బుధవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులతో కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి వెట్టి చాకిరీ చేయించుకుని రోడ్డును పడేశారన్నారు. ఇప్పటికే ఈ కార్మికులకు 7 నెలల నుంచి 24 నెలల జీతాలు బకాయిలు ఉన్నాయి బకాయిలతో ఎన్నాళ్ళు పస్తులుండి పనిచేయమంటారని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నామన్నారు. జిల్లా అధ్యక్షులు దండి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి 15 ఫైనాన్స్ నుంచి ఆరు నెలల జీతాలు గ్రీన్ అంబాసిడర్లకు గ్రీన్ గార్డులకు ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చినప్పటికీ జీతాలు అందడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకొని ఆ కార్మికులకు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సారికి ఎరకయ్య, సిహెచ్ వీరబాబు, కోటి, బి.వంశీకృష్ణ, సిహెచ్ లక్ష్మణ, ఎల్ పైడిరాజు, సిహెచ్ అప్పారావు, నారిబాబు తదితరులు పాల్గొన్నారు.



వినతి పత్రాన్నిస్తున్న సిపిఎం నాయకులు

వ్యకాస జెండావిష్కరణ

ప్రజాశక్తి- గంట్యాడ

ఈ నెల 8, 9, 10 తేదీలలో జంగారెడ్డి గూడెంలో జరుగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా బుధవారం కొటారుబిల్లి గ్రామంలో జెండా ఆవిష్కరణ జరిగింది. మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మొలగాడ రామారావు జండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి. శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ ఎన్ని పార్టీలు మారినా కూలీల బతుకులలో మార్పులు రాలేదన్నారు. వ్యవసాయ కూలి దినాలు తగ్గాయని కూలి గిట్టుబాటు ధర లేదని, చట్ట ప్రకారం కూలిని పెంచడం లేదని అన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయన్నారు. 200 రోజులు పని దినాలను రూ.600 కూలిగా ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ ప్రభుత్వాలు భేఖతర్ చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం. ఎల్లయ్య, పోలవరం దుర్గమ్మ, సింహాచలం, సత్యవతి, కంచమ్మ తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

సచివాలయ సందర్శన

ప్రజాశక్తి – జామి

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటరు జాబితా పరిశీలనలో భాగంగా జిల్లా కలెక్టర్ సూర్య కుమారి మండలం లోని కుమరాం గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా 16 మంది ఓటర్ల జాబితాను, వారి అర్హత పత్రాలతో సరి చూసి, ఓటర్ల జాబితా సక్రమంగానే జరిగినట్టు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ సచివాయం సిబ్బందితో మాట్లాడి, సచివాలయం సేవల పనితీరును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ సతీష్, వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్, గ్రామ సర్పంచ్, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

నిరుపయోగంగా ఆర్‌టిసి బస్టాప్

వేపాడ : మండలంలోని సోంపురం జంక్షన్ వద్ద ప్రజా రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికులు వేచి ఉండటం కోసం ఏర్పాటు చేసిన బస స్టాప్ ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఈ బస్సు స్టాప్ వద్ద బస్సులను ఆపకపోవడంతో అక్కడకు ఎవరూ వెళ్లడం లేదు. దీంతో బస్సు స్టాప్ చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ళ పొదలు పెరుకుపోయి మందు బాబులకు నిలయంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధకారులు స్పందించి బస్సు స్టాప్ వద్ద బస్సలను ఆపి బస్సు స్టాప్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.



తుప్పలు, పిచ్చిమొక్కలు మధ్య నిరుపయోగంగా ఉన్న బస్టాప్



విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులతో ఉపాధ్యాయులు, విద్యార్థులు

ముగిసిన రోబోటిక్ వర్క్ షాప్

ప్రజాశక్తి – శృంగవరపుకోట

మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న రోబోటిక్స్ వర్క్ షాప్ బుధవారం ముగిసింది. ఇందులో 45 మంది విద్యార్థులు పాల్గొని ఎనిమిది గ్రూపులుగా ఏర్పడి 8 రోబోట్‌లను తయారు చేశారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ మిర్యాల కృష్ణారావు సందర్శించి విద్యార్థులకు సూచనలు సలహాలు ఇచ్చారు. భావిభారత శాస్త్రవేత్తలుగా విద్యార్థులు ఎదగాలని సూచించారు. అందుకు అటల్ టింకరింగ్ ల్యాబ్‌లు ఎంతగానో సహకరిస్తాయని తెలియజేశారు. ప్రతి ఒక్క విద్యార్థి నూతన సాంకేతికతను అలవర్చుకోవాలని అటల్ టింకరింగ్ ల్యాబ్‌లలో ప్రాజెక్టులను చేసి స్థానిక సమస్యలకు నూతన పరిష్కారాలు కనుగొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బి లక్ష్మి, అటల్ టింకరింగ్ ల్యాబ్ ఇన్చార్జ్ వానపల్లి రమేష్, టెక్ టీం సొల్యూషన్స్ ప్రతినిధులు జయశ్రీ, సుధారాణి, ఉపాధ్యాయులు శాంతకుమారి, ఏవి స్వామి, జయ అనంతలక్ష్మి, శ్రీదేవి, వి ఈ సత్యనారాయణ, బి.కిరణ్ కుమార్, రహీం షేక్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

పర్సంటేజీలు దారుణం

బొబ్బిలి: ఐసిడిఎస్ పరిధిలో గ్యాస్, పోపుల బిల్లులు అంగన్వాడీ సెంటర్‌కు చెల్లిస్తున్న సందర్భంగా సూపర్వైజర్లకు, పిఒలకు 10 శాతం కమిషన్ చెల్లించాలని ఎస్‌టిఒ డిమాండ్ చేయడాన్ని ఖండిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకర్రావు తెలిపారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నిత్యావసరాలకు ఒక్కొక్కరికీ 2.75 రూపాయలు చెల్లిస్తున్నదని తెలిపారు. పర్సంటేజి చెల్లించలేమని అంగన్వాడీ కార్యకర్తలంటే డ్యూటీలు సక్రమంగా చేస్తున్నారా అని బెదిరిస్తున్నారని తెలిపారు. రామభద్రపురం మండలంలో చోట్ల పర్సంటేజీలు తీసుకుంటున్నారని తెలిపారు. దీనిపై జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎ. సురేష్, ఎస్.గోపాల్ పాల్గొన్నారు.

విశ్వ బ్రాహ్మణుల పట్ల చిన్నచూపు

బొబ్బిలి : విశ్వ బ్రాహ్మణుల సమస్యల పట్ల రాష్ట్ర ప్రభుత్వం చిన్నిచూపు చూస్తోందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు ముగడ వెంకటరమణ అన్నారు. బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చట్టసభల్లో విశ్వబ్రాహ్మణులకు ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి నేడు ఎమ్మెల్సీ అభ్యర్థిత్వానికి కూడా తమ కులానికి మొండి చేయి చూపారని అన్నారు. కార్పెంటర్లకు ఫారెస్ట్ అధికారుల ఒత్తిడి నుంచి విముక్తి కల్పించాలని, స్వర్ణకారులకు దొంగ బంగారం విషయాలలో అక్రమ కేసుల నుంచి పరిష్కారాల నిమిత్తం చట్ట సవరణ చేయాలని, బిసి కార్పొరేషన్ ద్వారా విశ్వబ్రాహ్మణ కుల వృత్తులకు అవసరమైన పనిముట్లను సబ్సిడీ ద్వారా సరఫరా చేయాలని కోరారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ యువజన ఆర్గనైజింగ్ సెక్రెటరీ ములగపాటి బంగారు రాజు, జిల్లా సమన్వయ కర్త మూర్తుర్తి ప్రసాద్, పట్టణ కార్యదర్శి కేశనకుర్తి త్రినాథ తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

భోగాపురం : మండలంలోని చేపలకంచేరు పంచాయతీ దిబ్బల పాలెం సమీపంలో సముద్ర తీరానికి గుర్తు తెలియని మృతదేహం కొట్టుకొచ్చింది. స్థానికుల కథనం ప్రకారం సుమారు 45 నుంచి 50 ఏళ్ల వయసు మధ్య ఉంటుందని బ్లాక్ చెక్స్ చొక్కా, బ్లాక్ ట్రాక్ వేసుకున్నాడని చెబుతున్నారు. మృతదేహం గుర్తుపట్టలేని విధంగా ఉంది. మధ్యాహ్న సమయంలో అలల ఉధృతికి ఒడ్డికి కొట్టుకు వచ్చి ఉండవచ్చునని పోలీసులు అంచనా వేస్తున్నారు. అయితే మృత దేహం లభ్యమైన ప్రాంతం భీమిలి పరిధిలోకి రావడంతో అక్కడ పోలీసులకు కేస అప్పగిస్తామని భోగాపురం పోలీసులు చెబుతున్నారు.

పుస్తెలతాడు అపహరణ

భోగాపురం : మహిళ మెడలో 3 తులాల పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తులు తెంపుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ముంజేరు గ్రామానికి చెందిన పిడుగు సుబ్బలక్ష్మి గ్రామ సమీపంలో పశువుల కాస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు బైక్ పై వచ్చి మెడలో పుస్తెలతాడును తెంపుకెళ్లారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలుడు అనుమానాస్పద మృతి

పూసపాటిరేగ : మండలంలోని ఎరుకొండలో మంగళవారం ఉదయం నిద్రలో శంఖా మనోజ్ (1) మృత్యువాత పడ్డాడు. తల్లిదండ్రులు మురళి, సత్యవతి ఉదయం లేచిన తరువాత మంచంపై బాలుడు నిర్జీవంగా పడి ఉండడం గమనించారు. వెంటనే సుందరపేట ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తన కుమారుడు మృతి అనమానంగా ఒందని తండ్రి మురళీ పోలీసులకు పిర్యాదు చేయడంతో ఎస్ఐ ఎ. నరేష్ కేసు నమోదు చేసి బాలుడు మృతదేహన్ని పోస్టుమార్టంకు తరలించారు.



మృతుడు మనోజ్

IN THE HONOURABLE COURT OF THE SENIOR CIVIL JUDGE ATVIZIANAGARAM
O.S.NO. 91/2014

Between: -
PANCHANGAM SRINIVASA KRISHNA KISHORE. .....PLAINTIFF
And :-
MANTHENA ANNAPURNA & ANOTHER. .....DEFENDANT

To
Dr. Gollapalli Rama Rao, S/o. Late Pydithalli, Hindu, aged about 54 years, R/at. Sanga Veedhi, DoorNo.19-13, Bobbili Town & Municipality, Vizianagaram Dist, (Defendant No.2).

NOTICE

Please take notice that the above named plaintiff instituted a suit against you before the Honorable Senior Civil Judge's Court, Vizianagaram. That the Honorable Court send suit summons through Court and registered post to you, you are escape from the service of the same.

Hence, you are hereby summoned to appear before this court in person or by a pleader, duly instructed and the said suit is posted to **22/12/2022 at 10-30 AM** before the Honorable court and if you want to contest the matter you may do so either in person or by a duty instructed pleader ad if you fail to show cause the matter will be decided in your absence and experte.

(By order of the Court)

Dr.Majji Suri Babu,
Majji Narasinga Rao,
Advocates, Garividi,
Cell No. 77803 34987